

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 31 | సంచిక : 8 | ఏప్రియల్ 2026

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

## ఈ సంచికలో. . . .


ఏకమక్షరం........................................ 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ....... 5

శ్రీమద్భగవద్గీత ....................................... 17

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం



ఉన్నది ఒక్కటే, ఉన్నది ఈశ్వరుడే! ఆయన తప్పించి ఏమీ లేదు అని మనకు అర్థమైతే మనస్సు యొక్క చాపల్యం తగ్గుతుంది. ఇప్పుడే ఇక్కడే మనస్సు వెళ్లి హృదయగుహలో పడిపోతుంది.

# ఏకమక్షరం

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణముల నుండి సేకరణ)

ఒకసారి భగవాన్ని అక్షరమొకటి ఉపదేశపూర్వకముగా ఇవ్వమని ప్రార్థిస్తే, అక్షరమైన దాన్ని ఎలా ఇచ్చేది? అన్నారు. "ఏక మక్షరము, నా హృదయ మందెపుడు ఏకమై వెలుగునే ఎటు రాయగలను" అని రాసి, తరువాత దాన్నే ఈ క్రింది శ్లోకంగా రాసి అనుగ్రహించారు. ఈ శ్లోకానికి వివరణ ఇస్తూ శ్రీ నాన్నగారు – సందేహాలని నిర్మూలించే శ్లోకం ఇది. ఈ శ్లోకం అర్థం అయితే, అవగాహన అయ్యి మన హృదయంలోకి దిగితే,ఇంక మనకి సందేహాలు పుట్టవు అన్నారు.

**ఏకమక్షరం హృది నిరంతరం ।**
**భాసతే స్వయం లిఖ్యతే కథం ॥**

**ఏకమక్షరం –** ఉన్నది ఒక్కటే సద్వస్తువు. అది అక్షర స్వరూపం, అంటే నాశనం లేనిది. క్షరం అంటే నాశనం అయ్యేది,ఎప్పుడూ పెర్మనెంటుగా ఉండేది అక్షరం. క్షీణించటం అనేది ఉండదు. నాశనం లేని వస్తువు ఒక్కటిగానే ఉంది, అంతటా ఉంది. అది ఒక్కటే చైతన్య వస్తువు. ఆ సద్వస్తువు తప్పించి ప్రతీదీ నశించేదే. వాసనలు జడం, శరీరం జడం. చైతన్యం తప్పించి, ఒక్క ఆత్మ తప్పించి ప్రతీదీ జడం. జడం కానిది అంటూ ఏదీ లేదు.

ఉన్నది ఒక్కటిగా కనిపించకుండా అనేకంగా కనిపిస్తుంటే అది మాయ. మట్టితోటి కుండలు రకరకాలుగా చెయ్యవచ్చు. ఆ నామరూపాలు మాయ, కాని మట్టి నిజం. ఆ నామరూపాలు పోయినా మట్టి ఉంటుంది. కుండ కూడా నిజమే, కుండగా నిజం కాదు, మట్టిగా నిజం. ఈ లోకం కూడా నిజమే, లోకంగా నిజం కాదు, చైతన్యంగా నిజం, బ్రహ్మముగా నిజం. ఆ దృష్టితో చూసి ఒక ఉపనిషత్తులో చెపుతాడు – దట్ ఇజ్ పెర్ఫెక్ట్, దిస్ ఇజ్ పెర్ఫెక్ట్. అంటే ఉన్న వస్తువు ఉన్నట్టుగా చూసినప్పుడు, వైకుంఠంలో ఏది ఉందో అది ఇక్కడా ఉంది, ఇక్కడేది ఉందో అది అక్కడా ఉంది. కుండలో నామరూపాలలో ఉన్నది కూడా మట్టే. మనం నామరూపాలని చూస్తున్నాము కాని నామరూపాలకి ఆధారంగా ఉన్న

మట్టిని చూడలేకపోతున్నాము. ఆకారాల వల్లే వికారాలు వస్తున్నాయి. మట్టిని చూడగలిగితే నీకు వికారాలు అన్నీ ఆగిపోతాయి.

**హృది నిరంతరం –** అది ఎక్కడో వైకుంఠంలోనో, కైలాసంలోనో, ఏదో లోకంలోనో ఉందని అనుకుంటున్నాం. అది ఇప్పుడే, ఇక్కడే సాక్షాత్తుగా ప్రతీవాడి హృదయంలో కూడా ప్రకాశిస్తోంది. నిరంతరం విరామం లేకుండా, ఆ సద్వస్తువు మన హృదయంలో ప్రకాశిస్తున్నది. మన కళ్ళకు కనిపించటం లేదు కాబట్టి మనకి తెలియటం లేదు. భూమికి ఉన్న ఆకర్షణ శక్తి మన కళ్ళకు కనిపించటం లేదు కాబట్టి లేదు అంటామా? మన హృదయంలో ఆ సద్వస్తువు, సత్య వస్తువు, నిత్య వస్తువు సాక్షాత్తుగా ప్రకాశిస్తోంది.

హృది నిరంతరం – దేహాలు మారిపోవచ్చు, కాని లోపల ఉన్న సద్వస్తువు భూత–వర్తమాన–భవిష్యత్ మూడు కాలాలలో, జాగ్రద్–స్వప్న–గాఢనిద్ర అనే మూడు అవస్థలలో చెదరకుండా, తనంతట తానుగా నిర్మలంగా ఉంటుంది, మీకు గాఢనిద్రలో తలంపులు, ఆలోచనలు, సంకల్పాలు లేవు, కాని అది మీ నిద్రకి కూడా సాక్షిగా ఉంటుంది. అన్ని కాలాల్లో అన్ని అవస్థలలో తనంతట తానుగా వెలిగేదే సద్వస్తువు. ఈ దేహం యొక్క పుట్టుకలతోటి, చావులతోటి, దేహప్రారబ్ధాల తోటి దానికి సంబంధం లేదు.

**భాసతే స్వయం –** అది స్వయంగా ప్రకాశిస్తున్నది. అంటే మనకి బయట ఏదైనా ఒక వస్తువుని చూడాలి అంటే పగలు సూర్యుడు సహాయం ఉండాలి, రాత్రి దీపం సహాయం ఉండాలి. వెలుగు సహాయం లేకపోతే వస్తువు ఉన్నా కనపడదు. భాసతే స్వయం–హృదయంలో ఉన్న వస్తువు చూడటానికి సూర్యుడు, చంద్రుడు, లైటులు ఇవేమీ అక్కరలేదు. బయటివెలుగు సహాయంతో నిమిత్తం లేకుండా, తనంతట తానుగా సహజంగా ప్రకాశిస్తుంది. అది ఉండటం వల్లనే అది తెలియబడుతోంది కాని, అది ఉందని ఇంకొకరు వచ్చి చెప్పక్కరలేదు. తనంతట తానుగా తెలియబడుతుంది. అది స్వయం ప్రకాశం. ఆ వస్తువుకి చావుపుట్టుకలతోటి సంబంధం లేదు. దానిని ఎప్పుడూ దుఃఖం ముట్టుకోదు, అశాంతి ముట్టుకోదు, కష్టాలు ముట్టుకోవు, పంచభూతాలు, ఈ సృష్టిలో ఏమీ ముట్టుకోవు.

అది స్వతంత్రమైనది, జగత్తుని పరిపాలించగల శక్తివంతమైనది.

**లిఖ్యతే కథం –** అటువంటి మహా శక్తివంతమైనటువంటి వస్తువు, జ్ఞాన స్వరూపము, ఆనంద స్వరూపము, శాంతి స్వరూపమైనటువంటి వస్తువు గురించి చెప్పమని, రాసి ఇమ్మని అడుగుతున్నావు, నోటితోటి ఎలా చెప్పగలను, కలంతోటి ఎలా రాయగలను! అది నోటితోటి చెప్పేది కాదు, కలం తోటి రాసేది కాదు; మాటలకి రచనలకి అందదు. మరి ఎలా గోచరమౌతుంది -- గురువు యొక్క చూపు, ఆ వీక్షణం నీకు సోకితే, నువ్వు గురువుని స్మరించు కోవటం కాదు, గురువు నిన్ను స్మరిస్తే, గురువు చూపుతో నీ చూపు ఐఖ్యమయినప్పుడు, మర్యాదలతోటి, మాటలతోటి, లాంఛనాలతోటి సంబంధం లేకుండా నీ హృదయంలో ఉన్న సద్వస్తువు నీకు ఎరుకలోకి వస్తుంది.

భగవాన్ చెప్పేది ఏమిటి అంటే, ఆ సద్వస్తువును తెలుసుకోకుండా మోక్షాన్ని పొందినవాడు ఎవడూ సృష్టిలో లేడు. ఇది మీరు గ్రహించండి. మన హృదయంలో ప్రకాశిస్తున్న సద్వస్తువుని మనం తెలుసుకోలేనప్పుడు మోక్షాన్ని ఎవరూ పొందలేరు. మోక్షం పొందకుండా శాంతిని పొందలేరు.

మనం దేవాలయాలకి వెళ్ళేటప్పుడు స్వామి మీ దయ నాకు కావాలి,మోక్షం కావాలి,లేకపోతే లోకానికి సంబంధించినవి అడుగుతాం. భగవంతుడిని దయ అడిగినప్పుడు మన నోరు అడగదు,దేహం అడగదు. నోటి ద్వారా లోపల మనసు అడుగుతుంది. శరీరం కూడా మనసు యొక్క కల్పితమే. ఏ మనస్సు అయితే నీ దయ నాకు కావాలి అని అడుగుతుందో,ఆ అడిగే మనసు యొక్క మూలం తెలిస్తేనే కానీ ఈశ్వర స్వరూపం తెలియదు, ఆత్మ స్వరూపం తెలియదు, దయ అంటే ఏమిటో కూడా తెలియదు. దేవుడు ఎక్కడో కైలాసంలోనో వైకుంఠంలోనో ఉన్నాడు అనుకొని అడుగుతున్నాం. ఈ వస్తువు ఎక్కడో మనకు దూరంగా ఉందన్న భావనలో దూరాన్ని పెంచుకున్నాము. దానికి కారణం ద్వైత బుద్ధి. ఈశ్వరుడు నీకు వేరుగా లేడు. నీ లోపలే ఉన్నాడు. ఉన్నది ఒక్కటే! ఈ భావన రావాలి మనకి, వేరు భావన పనికిరాదు. ఏకత్వ భావన రావాలి.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 5 మే 1996, ఈడూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఆచార్యస్వాములవారు మొట్టమొదట విష్ణుసహస్రనామాలకి వ్యాఖ్యానం రాశారు. ఆయన శరీరం విడిచిపెట్టే టైములో వివేకచూడామణి రాశారు. ఆచార్యస్వాములవారు మూడు రకాల గ్రంథాలు రాశారు. ఒకటి స్తోత్ర గ్రంథాలు, రెండు భాష్య గ్రంథాలు, మూడు ప్రకరణ గ్రంథాలు. స్తోత్ర గ్రంథాలు అంటే దేవతలని స్తోత్రం చేస్తూ రాశారు. అందరికీ ఒకే దేవుడు అంటే ఇష్టం ఉండదు, ఎవరి దేవుడిని వాళ్ళు స్తోత్రం చేసుకోవడానికి అందరి దేవుళ్ళ మీద స్తోత్రాలు రాశారు. రెండు భాష్య గ్రంథాలు, భాష్య గ్రంథాలు అంటే ఉపనిషత్తులకి, భగవద్గీతకి, బ్రహ్మసూత్రాలకి మూడింటికి కూడా భాష్యాలు రాశారు. శంకరాచార్యులవారు రాకముందు నుంచి కూడా భగవద్గీత ఉంది, కానీ ఆచార్యస్వాములవారు రాకముందు భగవద్గీతకి ఇంత ఖ్యాతి లేదు. ఆయన వచ్చి భగవద్గీతకి అర్థం రాసి దేశంలో ప్రచారం చేశారు, దానిని శంకర భాష్యం అంటారు.

ఒకటి ఉపనిషత్తులు, రెండు బ్రహ్మసూత్రాలు, మూడు భగవద్గీత. వీటిని ప్రస్థాన త్రయం అని పిలుస్తారు. ఈ మూడు చదివినవాడు కానీ హిందూమతం గురించి వివరంగా చెప్పలేడు. ఈ మూడింటి మీద కూడా వ్యాఖ్యానం రాశారు ఆచార్యస్వాములవారు, వాటిని భాష్య గ్రంథాలు అంటారు. తరువాత మూడు ప్రకరణ గ్రంథాలు, వివేక చూడామణి ప్రకరణ గ్రంథం. వేదాన్ని అందరూ అర్థం చేసుకోలేరు, వేదాల్లో సారాన్ని తీసుకుని ఆయన సొంత మాటల తోటి కొన్ని పుస్తకాలు రాశారు, వాటిని ప్రకరణ గ్రంథాలు అంటారు. వేదాల్లో ఉన్న సారాన్ని ప్రకటించారు కాబట్టి, వాటిని ప్రకరణ గ్రంథాలు అని చెబుతారు. వివేకచూడామణి ఆచార్యస్వాములవారు చివరి రోజులలో రాశారు. ఆచార్యస్వాములవారు ఒకటి చెప్పారు ఉపనిషత్తులలో ఏ విషయం అయితే వివరంగా చెప్పారో ఆ విషయం మనకి అర్థం అవుతుంటే, మనం వంట పట్టించుకుంటే, పరమేశ్వరుడి పట్లభక్తి, ప్రీతి కలిగి

ఉంటే నీకు ఎన్నిజన్మలు వచ్చినా ఇబ్బంది లేదు అన్నారు.

అసలు మానవజన్మ రావడం చాలా కష్టం. పూర్వజన్మల్లో నువ్వు ఏదైనా కొన్ని పుణ్యకార్యాలు చేసి ఉంటేనే మానవజన్మ వస్తుంది. పూర్వజన్మల్లో మీరు ఏదో కొంత మంచి చేసి ఉంటారు లేకపోతే మానవజన్మ కూడా రాదు. మానవజన్మ రావడం కష్టం, మానవజన్మ వచ్చిన తరువాత పవిత్రుడిగా జీవించడం కష్టం. అంటే మనసుని ఏకాగ్రం చేసుకోవడం, మనసుని పవిత్రం చేసుకోవడం, శాంతిగా జీవించడం కూడా ఇంకా కష్టం. కొంతమందికి పవిత్రత ఉండవచ్చు, మంచితనం ఉండవచ్చు, ఆధ్యాత్మిక జీవితాన్ని అలవరచుకోవాలి, భగవధనుభవం పొందాలి అని అనుకోవడం ఇంకా కష్టం. మానవజన్మ రావడం కష్టం, పవిత్రంగా జీవించాలి, ఉదాత్తమైన భావాల తోటి జీవించాలి అని రావడం ఇంకా కష్టం. జీవితంలో మనం ఆధ్యాత్మిక ఔన్నత్యం పొందాలి అనే సంకల్పం రావడం కూడా ఇంకా కష్టం. భగవద్గీత చదువుకుని, ఉపనిషత్తులు చదువుకుని, జ్ఞానులు చెప్పిన మాటలు చదువుకుని అర్థం చేసుకోవడం ఇంకా కష్టం. ఒకదానికంటే ఇంకొకటి కష్టం అని ఆచార్యస్వాములవారు చెబుతున్నారు.

మీరు భగవద్గీత చదివితే చదివేయవచ్చు, ఆ భగవద్గీత హృదయం ఏమిటి? ఆ శబ్దానికి అర్థం ఏమిటి? మనం గ్రహించవలసిన విషయం ఏమిటి? అంటే భగవంతుడు ఏ ఉద్దేశ్యం తోటి అయితే శబ్దాన్ని వాడాడో ఆ శబ్దాన్ని ఉన్నది ఉన్నట్టుగా తీసుకుని దాని తాత్పర్యాన్ని గ్రహించడం ఇంకా కష్టం. ఎందుచేత అంటే మనలో ఉన్నటువంటి వాసనలు, మనలో ఉన్నటువంటి సంస్కారాలు, ఆ శబ్దం యొక్క అర్థాన్ని సరిగ్గా బుర్రకి పట్టనివ్వవు. ఒక గ్రంథాన్ని చదివి అర్థం చేసుకోవడం కూడా చాలా కష్టం, అది కూడా మీరు అనుకున్నంత తేలిక కాదు. మీరు ఏ బ్రహ్మం గురించి అయితే పుస్తకాలలో చదివారో ఆ బ్రహ్మమును డైరెక్ట్‌గా అనుభవంలోకి తెచ్చుకోవటం ఇంకా కష్టం. ఒకదానికంటే ఇంకొకటి కష్టం అంటున్నారు.

జ్ఞానం, విజ్ఞానం. జ్ఞానం అంటే ఏమిటి? కొంత ఇన్ఫర్మేషన్ సేకరించడం. మనం వస్తువుని ఎలా పొందాలి అనే విషయాన్ని తెలుసుకోవడం జ్ఞానం, మనం తెలుసుకున్న

దానిని అనుభవంలోకి తెచ్చుకోవడం విజ్ఞానం. జ్ఞానానికి, విజ్ఞానానికి కొంత గ్యాప్ ఉంటుంది, ఎందుచేత అంటే, మనం ఏ విషయాన్ని అయితే అనుభవంలోకి తెచ్చుకోవాలి అనుకుంటున్నామో దానిని ఈ వాసన అనుభవంలోకి తెచ్చుకోనివ్వదు. అప్పుడు యుద్ధం జరుగుతుంది. మీరు ఏదైనా విషయం తెలుసుకుంటారు, విషయం తెలుసుకోవడం వేరు, అనుభవంలోకి రావడం వేరు. అనుభవంలోకి రావడం చాలా కష్టం, మీరు తెలుసుకున్న విషయం మీరు అనుభవంలోకి తెచ్చుకోవడానికి మీ జన్మాంతర వాసనలు అడ్డు వస్తాయి, రాగద్వేషాలు అడ్డు వస్తూ ఉంటాయి. అలా అడ్డు వచ్చినప్పుడు వాటిని తొలగించుకోవడానికి మీరు ప్రయత్నం చేస్తే, తొలగము అని అవి చెబుతాయి. అప్పుడు విపరీతమైన పోరాటం జరుగుతుంది. దానిని మీరు తట్టుకోగలిగితే మీకున్న జ్ఞానం విజ్ఞానంగా మారుతుంది. మీకు తెలిసున్న విషయం మీకు అనుభవంలోకి రావడానికి కూడా గురువు అనుగ్రహం అవసరం, ఈశ్వర అనుగ్రహం అవసరం, అందుచేత అనుగ్రహం లేకుండా మటుకు మీరు అనుభవాన్ని పొందలేరు. మీరు ఉపనిషత్తులు చదివాము అని చెబితే సరిపోదు, ఆ విషయాన్ని అనుభవంలోకి తెచ్చుకోవడానికి కూడా కొంత టైము పడుతుంది, కొంత పోరాటం అవసరం, కొంత effort అవసరం అని ఆచార్యస్వాములవారు అంటున్నారు.

బ్రహ్మమును ఎప్పుడైతే డైరెక్ట్‌గా మీరు అనుభవంలోకి తెచ్చుకున్నారో అదే మీ కడసారి స్థితి, చివరి స్థితి, ఫైనల్ స్టేట్, అప్పుడు మోక్షానుభవం మీకు కలుగుతుంది. వస్తువు మీకు డైరెక్ట్‌గా అనుభవంలోకి వస్తేనే కానీ మోక్షం రాదు. అది కబుర్లు, కాకరకాయల వల్ల వచ్చేది కాదు. నువ్వు ఏ విషయం అయితే నీ బుద్ధి తోటి గ్రహిస్తున్నావో అది నీ హృదయంలో డైరెక్ట్‌గా నువ్వు experience చెయ్యాలి అప్పుడు నీకు మోక్షం కలుగుతుంది, అప్పటివరకు నీకు మోక్షం కలుగదు. అయితే ఈ లోపులో మోక్షం కలగకపోయినా నీకు జన్మలు వచ్చేస్తాయి, నువ్వు కంగారు పడిపోకు. ఉపనిషత్తుల మీద ప్రీతి, దేవుడి మీద ప్రీతి, ఆచార్యుడి మీద ప్రీతి, పరమేశ్వరుడి మీద భక్తి నువ్వు వదులుకోకుండా ఉంటే ఇంకొక నాలుగుజన్మలు అదనంగా వచ్చినా ఫరవాలేదు ఈ లోపులో నువ్వు కంగారు

పడవలసిన పనిలేదు. నువ్వు సరైనమార్గంలోనే ఉన్నావు కాబట్టి గమ్యానికి వెళతావు. మనం కరెక్ట్ పాత్‌లో ఉన్నప్పుడు ఇంకొక గంట ఆలస్యమైనా గమ్యానికి వెళతాము.

అంటే కొన్ని వేలాదిజన్మలు, సమగ్రంగా జీవించిన వాడికి కానీ ఆధ్యాత్మిక చింతన కలుగదు అంటున్నారు. అంటే పూర్వజన్మలలో నువ్వు సమగ్రంగా జీవిస్తే, వివేకవంతంగా జీవిస్తే ఈజన్మలో నీకు మోక్షం పొందాలి అనే తపన కలుగుతుంది కానీ, ఈజన్మలో నీకు బ్రహ్మానుభవం పొందాలి అనే కాంక్ష కలుగుతుంది కానీ, ఊరికే నీకు గాలికి తిరిగితే రాదు. అంటే గతజన్మలో నువ్వు చేసిన కృషే నీకు సొమ్ము అవుతుంది. అంటే నువ్వు ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందాలి, మోక్షానుభవం పొందాలి అనే కోరిక ఊరికే గాలికి వచ్చేయదు. పూర్వజన్మలో నువ్వు కష్టపడి ఉంటే, సాధన చేసి ఉంటే నీ ముఖం ఇటు తిరుగుతుంది కానీ లేకపోతే ఇటు తిరిగేందుకు అవకాశం లేదు, చెప్పుడు మాటల వల్ల వచ్చేది కాదు. గతజన్మలో నువ్వు చేసినటువంటి పుణ్యాన్ని బట్టి వస్తుంది కానీ ఇది కేవలం గాలికి వచ్చేసేది కాదు, ఏదో వచ్చేస్తుంది అనుకుంటే అలా రాదు. పూర్వజన్మలో నువ్వు ఈ రకంగా జీవించి ఉంటే ఈ కాంక్ష కలుగుతుంది కానీ లేకపోతే కలుగదు. నీకు మోక్షం సంపాదించాలి అనే కాంక్ష ఒక్కటే సరిపోదు. మంచిమార్గంలో, అంటే కరెక్ట్ పాత్‌లో నిన్ను ఎవడైతే లీడ్ చెయ్యగలడో, ఎవడైతే చక్కటిమార్గం నీకు సూచించగలడో అటువంటి గురువు దొరకడం కూడా దైవానుగ్రహం లేకపోతే నీకు దొరకదు.

మానవజన్మ రావటం అంత తేలిక కాదు. అందుచేత దానిని నువ్వు సద్వినియోగం చేసుకోవాలి. వచ్చిన దానిని మీరు తేలికగా చూడకండి. అవకాశం రావడం కష్టం, అవకాశం రానప్పుడు తెలివైనవాడు ఏమీ చెయ్యలేడు, తెలివితక్కువ వాడు ఏమీ చెయ్యలేడు. ఒకడికి బాగా తెలివితేటలు ఉన్నాయి అనుకోండి, వాడికి ఏమీ అవకాశాలు రావడం లేదు అనుకోండి వాడు ఏమీ చెయ్యలేడు. మానవజన్మ వచ్చింది అంటే ఇదొక చక్కటి అవకాశం. తెలివైనవాళ్ళు దానిని పట్టుకుంటారు, తెలివితక్కువ వాళ్ళు అవకాశాన్ని వదిలేస్తారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని నువ్వు ఒడ్డుకి వచ్చేయ్. ఈ అవకాశం మళ్ళీ వస్తుందని

గ్యారంటీ లేదు. అందుచేత ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని నువ్వు ఒడ్డుకి రావడానికి ప్రయత్నం చెయ్యి. ఇవన్నీ ఉన్నప్పటికీ కూడా మంచిజన్మ, సూక్ష్మబుద్ధి, తగినటువంటి గురువు దొరికినప్పటికీ కూడా కొంతమంది అవకాశాలు వదిలేస్తూ ఉంటారు. మానవజన్మ రావచ్చు, బుద్ధిసూక్ష్మత ఉండవచ్చు, శాస్త్రాన్ని గ్రహించే శక్తి ఉండవచ్చు, ఇన్ని అవకాశాలు ఉన్నప్పటికీ కూడా మోక్షం పొందాలి అనే కాంక్ష ఉండకపోవచ్చు, మోక్షం పొందడానికి ప్రయత్నం చెయ్యకపోవచ్చు. అంటే ఈ అవకాశాలు వచ్చి కూడా కొంతమంది వాటిని దుర్వినియోగం చేసుకుంటారు. మీకు అర్థం అవుతోందా? అంటే పరమేశ్వరుడు మనకి ఏదైనా శక్తి ఇస్తే ఆ శక్తిని సద్వినియోగం చెయ్యాలి, దుర్వినియోగం చెయ్యకూడదు. దుర్వినియోగం చేస్తే లోయర్ బర్త్ వస్తుంది, సద్వినియోగం చేస్తే హయ్యర్ బర్త్ వస్తుంది. భగవంతుడు మనకి ఇచ్చిన అవకాశాలను చూసి మనం గర్వపడకూడదు, వాటిని సద్వినియోగం చెయ్యాలి, ఎలా సద్వినియోగం చెయ్యాలో శోధించాలి.

ఎదురుగా కనిపిస్తున్న మనిషినే నువ్వు ప్రేమించలేనప్పుడు నీకు కనిపించని దేవుడిని నువ్వు ఎలా ప్రేమించగలవు? నా కళ్లకి ఒక మనిషి కనిపిస్తున్నాడు, ఆ మనిషి మీద నాకు ప్రేమ లేదు, ఎక్కడో కనిపించని దేవుడి మీద నాకు ప్రేమ ఉందంటే అది నిజం కాదు, ఆ మాటలు నమ్మవద్దు అని చెప్పాడు. కనిపిస్తున్న మనిషి మీదే నీకు ప్రేమ లేనప్పుడు, విశ్వాసం లేనప్పుడు, మన కంటికి కనబడని దేవుడి మీద నాకు విశ్వాసం ఉంది అంటే ఆ మాట నిజం కాదు. అటువంటి మాటలు ఎవరైనా చెప్పినా మీరు నమ్మవలసిన అవసరం లేదు అని స్వామీజీ చెప్పేవారు. శంకరాచార్యుల వారు ఏమని చెబుతున్నారు అంటే మీకు ఇన్ని అవకాశాలు ఉండి కూడా మోక్షం సంపాదించడానికి, ఆత్మజ్ఞానం సంపాదించడానికి

**మనలో ఉన్న కోరికలే దొంగలు. రాముడిని స్మరించటం వలన, రాముడు చెప్పిన మాటలను శ్రవణం, మననం చేసి ఆ ప్రకారం జీవించటం వలన లోపల దొంగలకు సహజంగానే మరణం వచ్చేస్తుంది.**



మీరు ప్రయత్నం చెయ్యకపోతే, మీరు సాధన చెయ్యకపోతే మిమ్మల్ని మీరు చంపుకున్నట్టే, ఇంక మిమ్మల్ని రక్షించేవాడు ఎవడున్నాడు ఇక్కడ అంటున్నారు. అవకాశం లేనివాళ్ళకి ఎలాగూ లేదు, అవకాశం ఉండి కూడా మీరు ప్రయత్నం చెయ్యకుండా అవకాశాన్ని జారబెట్టుకుంటూ ఉంటే, మిమ్మల్ని మీరు హత్య చేసుకున్న దానితోటి సమానం. ఇతరులు ఎవరూ మిమ్మల్ని చంపడం లేదు, మిమ్మల్ని మీరే చంపుకుంటున్నారు. అంటే అవకాశాలు అన్నీ విడిచిపెట్టుకుంటూ ఉంటే, ఏది నిజం? ఏది నిజం కాదు? ఏది సత్యం? ఏది సత్యం కాదు? దేనిని స్వీకరించాలి? దేనిని విసర్జించాలి? అనే వివేకం కనుక మీకు లేకపోతే మీ అంతట మీరే నాశనం అయ్యిపోతారు, ఇతరులు వచ్చి మిమ్మల్ని నాశనం చెయ్యక్కర్లేదు అని ఆచార్య స్వాములవారు అంటున్నారు. అవకాశాలు అన్నీ ఉండి కూడా, చేతికి వచ్చిన అవకాశాలని ఎవడైతే విడిచిపెట్టుకుంటున్నాడో వాడే ఫూల్, వాడికంటే పెద్ద ఫూల్ ఎవడూ ఈ ప్రపంచంలో లేడు. అవకాశాన్ని పట్టుకుని వాడు అభివృద్ధిలోకి రావాలి. అవకాశాలు వచ్చినప్పుడు విడిచిపెట్టేసి తనని తాను ఉద్ధరించుకోవడానికి ఎవడైతే ప్రయత్నం చెయ్యడో, వాడికంటే తెలివితక్కువ వాడు ఎవడూ లేడు అని ఇక్కడ ఆచార్యస్వాములవారు చెబుతున్నారు.

కొంతమంది యజ్ఞం చేస్తూ ఉంటారు, కొంతమంది యాగాలు చేస్తూ ఉంటారు, కొంతమంది విగ్రహాలని పూజిస్తూ ఉంటారు. కొంతమంది పారాయణాలు చేస్తారు. ఇలా సమాజంలో రకరకాల భక్తులు ఉన్నారు. మీరు యజ్ఞాలు చెయ్యవచ్చు, యాగాలు చెయ్యవచ్చు, పూజలు చెయ్యవచ్చు, వీటి వల్లనే మీకు మోక్షం వస్తుంది అని మటుకు ఎప్పుడూ అనుకోవద్దు. మీకు డబ్బు ఉందని పెద్ద పెద్ద యజ్ఞాలు చేస్తే మీకు పెద్ద పెద్ద భోగాలు రావచ్చు, రాబోయేజన్మలో ఆరోగ్యకరమైన శరీరం ఇచ్చి, అనుభవించమని భోగపదార్థాలు కూడా మీ ఎదురుగా పరమేశ్వరుడు పెట్టవచ్చు. మీరు సుందరాకాండలు పారాయణం చేసినా, మీరు యజ్ఞాలు, యాగాలు చేసినా, మీ హృదయంలోని సద్వస్తువును మీరు అనుభవంలోకి తెచ్చుకోకుండా, ఈ పారాయణాల వల్ల, ఈ యజ్ఞాల వల్ల, యాగాల వల్ల, మోక్షం ఇవ్వడానికి దేవుడు అంత తెలివి తక్కువవాడు కాదు. మనల్ని యజ్ఞాలు

చేసుకోవద్దు అని చెప్పడం లేదు, పూజలు చేసుకోవద్దు అని చెప్పడం లేదు, మీ తిప్పలు ఏదో మీరు పడండి, భగవద్గీత పారాయణ చేసుకోండి, సుందరాకాండ పారాయణ చేసుకోండి, చేసుకోవద్దు అని చెప్పడం లేదు వాటి వలన మీరు పవిత్రులు అవుతారు, కొంతవరకు evolve అవుతారు. మేము యజ్ఞం చేసేశాం, పూజ చేసేశాం, జపం చేసేశాం, కాశీ వెళ్లాం, రామేశ్వరం వెళ్లాం, దేవుడి చుట్టూ తిరిగి వచ్చేశాం అంటే ఇవన్నీ చేసుకోండి కాదు అనడం లేదు అంతమాత్రం చేత మోక్షం వస్తుంది అని భ్రాంతిలో పడకండి అంటున్నారు. అంటే మీకు ప్రోపర్‌గా అర్థం అవ్వడం కోసం చెబుతున్నారు. మేము యాత్రలకి వెళ్లి వచ్చాం, భగవద్గీత చదివేశాం, సుందరాకాండ రోజూ పారాయణం చేస్తున్నాం, ఇలా అనుకోవద్దు, చేస్తే చేసుకోండి మంచిదే అంతమాత్రం చేత మీకు మోక్షం వస్తుంది అని మిమ్మల్ని మీరు మాయ చేసుకోకండి, మీరు భ్రమలో పడకండి అని ఆచార్యస్వాములవారు అంటున్నారు.

ఆచార్యస్వాములవారు ఏమంటున్నారు అంటే మీ హృదయంలో ఒక నిజం ఉంది, ఆ నిజంలోకి నువ్వు మేల్కోవాలి. అంటే గాఢనిద్రలోనుండి జాగృదావస్థలోకి ఎలా మేల్కొంటున్నామో అలా మీ హృదయంలో ఉన్న నిజంలోకి నువ్వు మేల్కోవాలి. అలా మేల్కొంటేనే కానీ నీకు మోక్షానుభవం వచ్చే సమస్యే లేదు. హృదయంలోకి నువ్వు మేల్కొన్నప్పుడు నీకు మోక్షం వస్తుంది కానీ లేకపోతే ఈ అధ్యయనాల వల్ల, ఈ పాండిత్యాల వల్ల, ఈ దండాల వల్ల వచ్చేది కాదు మోక్షం. లోపల ఉన్నటువంటి సత్యాన్ని తెలుసుకోవడానికి నువ్వు ప్రయత్నం చెయ్యకుండా ఈ పారాయణాల తోటి సరిపెట్టుకుంటే, బాహ్యావిషయాలకి యజ్ఞ, యాగాలకి నీ సాధన సరిపెట్టేసుకుంటే కొన్ని వేలజన్మలు ఎత్తినా నీకు మోక్షం రాదు, రాదు, రాదు. ఎందుకు ఇంతలా చెప్పడం అంటే ఈ పూజ చేశాం, ఈ జపం చేశాం మనకి మోక్షం వచ్చేస్తుంది అనుకుంటారేమో, అలా రాదు. సబ్జెక్టు అర్థం అవ్వడం కోసం, ఉన్నది ఉన్నట్టుగా మీకు చెప్పడం కోసం, తరువాత మీరు చేస్తారో, చెయ్యరో అది వేరే విషయం, గురువు తన డ్యూటీ ప్రకారం చెప్పాలి కాబట్టి గురువు చెబుతున్నాడు.

నువ్వు ఈశ్వరుడి మీద భక్తి విడిచిపెట్టకు. ఆభక్తికి కారణం కూడా ఉండకూడదు.

కారణం ఉంటే కారణం నెరవేరుతుంది. అంతే. నీకు ఈశ్వరుడి మీద అకారణభక్తి కుదిరితే ఇంకో వెయ్యిజన్మలు ఎత్తినా ఏమీ ఇబ్బంది లేదు, అకారణభక్తి వల్ల మోక్షం వస్తుంది, కారణభక్తి వల్ల మోక్షం రాదు. కారణభక్తి వల్ల నీకు దేహబుద్ధి విడిచిపెట్టదు. దేహబుద్ధి విడిచిపెడితేనే కానీ ఆత్మబుద్ధి కలుగదు. దేహబుద్ధి నశించకుండా మోక్షం ఎవరికీ రాదు. రమణమహర్షి గారు ఏమని చెప్పారు అంటే పది శాస్త్రాలలో ఉన్నది పది రకాలుగా నీకు చెప్పడం అనవసరం, ఎవడైతే నేను పుట్టాను అనుకుంటున్నాడో వాడికి మోక్షం ఎన్నడూ రాదు అని చెప్పారు. మనం అందరం పుట్టాం అని అనుకుంటున్నాం కాబట్టి మనకి మోక్షం రాదని చెప్పకుండా చెబుతున్నారు. ఎవరు పుడతారు? దేహం పుట్టింది. దేహం పుట్టినప్పుడు మనం ఏమనుకుంటున్నాం? దేహం నేను అనుకుంటున్నాం కాబట్టి నేను పుట్టాను అనుకుంటున్నాం. నేను పుట్టాను అనుకునేవాడికి మోక్షం రాదని చెప్పారు. అంటే దేహబుద్ధి ఉన్నంతకాలం వాడు నేను పుట్టాను అని అనుకుంటాడు. ఆ దేహం మరణించినప్పుడు నేను మరణించాను అనుకుంటాడు. ఎప్పుడైతే ఆత్మబుద్ధి కలిగిందో వాడు నేను పుట్టాను అని అనుకోడు, ఎందుచేత అంటే ఆత్మ పుట్టలేదు కాబట్టి. నేను పుట్టాను అనుకునేవాడికి మోక్షం రాదు, వాడు ఎన్ని శాస్త్రాలు చదివినా, ఎన్ని యజ్ఞాలు చేసినా, యాగాలు చేసినా, ఏదైనా పుణ్యం రావచ్చు, అనుభవిస్తే పోతుంది. అదంతా కాలప్రవాహంలో కొట్టుకుని పోయేదే! ఇవాళ పచ్చగా కనిపిస్తుంది, రేపు వెళ్లిపోతుంది.

సర్వసాధారణంగా మానవుడి మనస్సు ఎటువంటిది అంటే ఈరోజు పచ్చగా కనిపించి రేపు వెళ్ళిపోయే దానిమీద మన మనస్సు వాలుతూ ఉంటుంది. అందుచేత ఈ ప్రపంచం అనే అల్లకల్లోలంలో, ఈ ప్రపంచం అనే సముద్రంలో ఎవడో వచ్చి నిన్ను రక్షిస్తాడు అనుకుంటున్నావేమో, ఎవడూ రాడు. నిన్ను నువ్వు రక్షించుకోవడానికి ప్రయత్నం చేస్తే దేవుడు వచ్చి ఆయన సహాయం ఏదో ఆయన చేస్తాడు. ఈ ప్రపంచం అనేది ఒక పెద్ద అజ్ఞాన సముద్రం. ఈ సముద్రం లోంచి ఎవడో వచ్చి నిన్ను రక్షిస్తాడు అని కనిపెట్టుకుని ఉండకు. ఎవడో వచ్చి నిన్ను రక్షిస్తాడు, ఎవడో వచ్చి నాకు మోక్షం ఇచ్చేస్తాడు అని

కనిపెట్టుకుని ఉండకు, ఇందులోంచి నువ్వు బయట పడాలి అంటే మోక్షకాంక్ష లేకుండా ఇందులోంచి నువ్వు బయట పడలేవు. జ్ఞానాన్ని సంపాదించుకోవాలి అనే తపన లేకుండా ఇందులోంచి నువ్వు బయట పడలేవు. మోక్షం పొందడం కోసం నీ అంతట నువ్వు ప్రయత్నం చేస్తే గురువో, ఈశ్వరుడో వచ్చి ఆయన చేసే సహాయం నీకు చేస్తాడు కానీ నీ ఎఫర్ట్ ఏమీ లేకపోతే, నీ వైపు ప్రయత్నం లేకపోతే, సాధన లేకపోతే ఎవడూ ఏమీ చేయలేడు.

ఆచార్యస్వాములవారు ఏమని చెబుతున్నారు అంటే మీ అంతట మీరే కొంచెం ప్రయత్నం చెయ్యండి, make a little effort. పెద్ద ప్రయత్నం అక్కర్లేదు, చిన్న ప్రయత్నం ఏదో చేస్తే గురువు వచ్చి ఆయన చేసే సహాయం ఏదో ఆయన చేసి ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు. దేవుడు ఎవరో వచ్చి నన్ను రక్షిస్తాడు అని నువ్వు మొద్దుఅబ్బాయిలా కూర్చోకు. నీకు ఎంతవరకు చేతనవునో నీ ప్రయత్నం ఏదో నువ్వు చెయ్యి, అప్పుడు పరమేశ్వరుడు వచ్చి ఆయన చేసే సహాయం నీకు చేస్తాడు. అందుచేత అజ్ఞానం అనే సముద్రం లోంచి, అవిద్య అనే సముద్రం లోంచి బయటపడడానికి ఎవరో వచ్చి నిన్ను తీసుకెళ్ళి ఉద్ధరిస్తారు అని కనిపెట్టుకుని ఉండకు. నీకు చేతనైనంత ప్రయత్నం ఏదో నువ్వు చెయ్యి, చేస్తే భగవంతుడు వచ్చి అనుగ్రహించి ఆయన స్వరూపం నీకు ఇస్తాడు, గురువు నిన్ను రక్షిస్తాడు. నీ ప్రయత్నం ఎంతవరకు చేతనైతే అంతవరకే నువ్వు ప్రయత్నం చెయ్యి.

కొంతమంది వివేకవంతులు ఏమి చేస్తారు అంటే ప్రాపంచిక అనుబంధాలను ఒకేసారి కాకుండా, నెమ్మదిగా, స్లోగా ఒకొక్క బంధం, ఒకొక్క బంధం తెంచుకుంటూ వస్తారు. మనం తెంచుకుంటాం అని చెప్పడం లేదు, వివేకవంతులు ఈ లోకానికి సంబంధించిన అనుబంధాలు, దేహానికి సంబంధించిన అనుబంధాలు స్టడీగా, సైలెంట్‌గా ఒకొక్కదానిని తెంచుకోవడానికి ప్రయత్నం చేస్తారు. మనం ప్రయత్నం చేస్తున్నాం అని చెప్పడం లేదు ఆచార్యస్వాములవారు. వివేకవంతులు ప్రయత్నం చేస్తారు అంటున్నారు. అంటే లోకంలో ఏవో బంధాలు ఉంటాయి, వాటికి కొత్త బంధాలు తగిలించుకోకుండా, ఉన్న బంధాలు అన్నీ ఒకేసారి తెంపేయకుండా ఒకటి తరువాత ఒకటి నెమ్మదిగా

తెంచుకుంటూ వస్తారు.

మనకి హృదయంలో గ్రంథులు ఉంటాయి, ఒకడు పేకాట కోసం లక్షల కోట్లు ఖర్చు పెట్టేస్తాడు కానీ ఎవడికైనా మంచి చెయ్యడానికి ఇష్టపడడు. ఒకడికేమో కీర్తి కాంక్ష, ఆ కీర్తి కూడా ఒక గ్రంథి. వాడికి కీర్తి వస్తుంది అంటే రూపాయి ఇస్తాడు కానీ వాడికి కీర్తి రాదు అంటే రూపాయి కూడా ఇవ్వడు. అది మంచిపని అయినా సరే వాడికి కీర్తి వస్తుందా? లేదా? చూసుకుంటాడు. ఇది మంచిపని కదా మనకి కీర్తి రాకపోయినా ఫరవాలేదు అనుకోడు, వాడికి కీర్తి వస్తేనే ఇస్తాడు, లేకపోతే ఇవ్వడు. మీకు అర్థం అవుతోందా? వీటిని ఉపనిషత్తులలో గ్రంథులు అంటారు, అంటే ముడులు. దైవానుగ్రహం లేకుండా ఆ ముడి తెగదు. ఈ బంధాలు, ఈ గ్రంథులు, ఈ ముడులు మన అంతట మనం వదిలించుకోలేము. ఈ గ్రంథులు, ఈ ముడులు, ఈ వాసనలు, ఈ సంస్కారాలు నన్ను దేహానికి, లోకానికి కట్టి పడేశాయి ఈ ముడులు, ఈ బంధాలు, నేను తెంపుకోలేక పోతున్నాను. ఈ బంధాల నుండి విడుదల చెయ్యడానికి నువ్వు రావలసిందే అని భగవాన్‌తో చలం గారు అన్నారు.

నా తెలివితేటల తోటి నేను కనీసం ఒక్క గ్రంథిని కూడా తెంచలేను. ఏదో ప్రయత్నం అంటావా నువ్వు చెయ్యమని చెబుతున్నావు కాబట్టి చేస్తాను. కానీ ఈ వాసనలని, ఈ గ్రంథులని బయటకి గెంటటానికి నువ్వు వచ్చి లాగవలసిందే కానీ నా తెలివితేటలు, నా ప్రయత్నం సరిపోదు. మనం వాసన అంటాం, habit అంటాం, ఉపనిషత్తులలో దీనిని గ్రంథి అంటారు. అంటే పునర్జన్మలకి సంబంధించిన గ్రంథులు, దేహాన్ని తెచ్చిపెట్టె గ్రంథి, లోకాన్ని తెచ్చిపెట్టే గ్రంథి నీ హృదయంలోనే ఉంది. ఆ గ్రంథితో నువ్వు విడువడాలి. ఆ ముడి ఎవడికైతే విడువడిందో అప్పుడు లోపల ఉన్న ఈశ్వరుడు తానుగా వ్యక్తం అవుతాడు. అప్పుడు లోపల ఉన్నటువంటి పరమ శాంతి, అలౌకిక శాంతి, అభౌతిక శాంతి, ఆ నిర్వాణసుఖం, పూర్ణసుఖం తానుగా నీకు వ్యక్తం అవుతుంది, ఎప్పుడు? గ్రంథి లోంచి నువ్వు విడిపోయిన తరువాత. ఒకవేళ నీ శరీరం మరణించకుండానే ఇక్కడే నీకు ఆ గ్రంథులు అన్నీ తెగిపోతే ఇక్కడే నీకు ఆ పూర్ణసుఖం, ఆభవసుఖం, చిత్‌సుఖం, ఆత్మసుఖం

అనుభవంలోకి వస్తుంది.

రమణమహర్షి గారు ఏమంటున్నారు అంటే పచ్చగడ్డి దొరుకుతుంటే దూడ వట్టిగడ్డి దగ్గరకు వెళ్ళదు అలాగే మీకు ఆత్మశాంతి, ఆత్మసుఖం దొరికితే మీ మనస్సు ప్రపంచం వైపుకి తిరగదు, అటు చూడదు. తెలివిగల వాళ్ళు ఏమి చేస్తారు అంటే కంగారు పడకుండా, పెద్ద advertisement లేకుండా, చడి చప్పుడు లేకుండా ఒక్కో గ్రంథి, ఒక్కో గ్రంథి, ఒకొక్క అలవాటు, ఒకొక్క అలవాటు తెంచుకుంటూ వస్తారు. నిజమైన సాధకుడు అలాగే ఉంటాడు. ఎవడైతే హృదయ గ్రంథిని తెంచుకోవాలి అనుకుంటున్నాడో వాడికి ఆడంబరం ఉండదు. ఏమి గొడవ లేకుండా ఆ గ్రంథిని ఒకొక్కటి ఒకొక్కటి తెంచుకుంటూ వస్తాడు. పక్కవాడికి కూడా తెలియనివ్వడు, అది సాధకుడి యొక్క లక్షణం. ఈ ఊరేగింపులు, ఈ గొడవలు అన్నీ కూడా సాధకుడికి ఎందుకు? సాధకుడు కానివాడికే ఈ ఊరేగింపులు అన్నీ. సాధకుడు పక్కవాడికి తెలియకుండా, ఏ వాసన అయితే వాడిని దేహానికి బంధిస్తోందో, ఏ వాసన అయితే ఈ లోకానికి బంధిస్తోందో దానిని కట్‌చేసుకోవడానికి చూసుకుంటాడు కానీ ఈ ఊరేగింపులు, యజ్ఞాలు, యాగాలు ఈ గొడవలు వాడికి అక్కర్లేదు, అది తెలివైన వాళ్ళు, వివేకవంతుల లక్షణం అని చెబుతున్నారు. వివేకవంతులకి ఊరేగింపులు అక్కర్లేదు వాళ్లకి ఏ వాసన, ఏ గ్రంథి, ఈ ప్రపంచానికి వాడిని కట్టిపెట్టి ఉంచుతోందో చూసుకొని ఆ గ్రంథిని కట్ చేసుకుంటాడు. అలా కట్‌చేసుకుంటే ఈ ప్రపంచంలోంచి వాడు విడువడతాడు. ఆ గ్రంథిని కట్‌చేసుకోకుండా ఈ ఊరేగింపులు ఏమిటి, ఈ గొడవ ఏమిటి, ఈ అల్లరి ఏమిటి అంటున్నారు ఆచార్యస్వాములవారు.

సాధకుడి లక్షణం ఏమిటి అంటే ఏ వాసన మనలను బంధిస్తోంది, ఏ వాసన



**నీ మనస్సు ఎక్కడా వాలకుండా ఉండటమే వైరాగ్యం. మనస్సు దాని స్వస్థానాన్ని విడిచిపెట్టకుండా ఉండటమే జ్ఞానం అన్నారు భగవాన్.**

వలన మనకు పునర్జన్మ వస్తోంది అని వాడంతట వాడు అనాలసిస్ చేసుకుంటాడు, observation చేసుకుంటాడు, watching చేసుకుంటాడు. దానిని కట్ చేయటానికి ప్రయత్నం చేస్తాడు. అలా ప్రయత్నం చేస్తే అప్పుడు ఈశ్వరానుగ్రహం వస్తుంది, అది కట్ చేస్తుంది. కాలువలో బల్లకట్టులు ఉంటాయి. బల్లకట్టులు ఆ పక్కవాడిని ఈ పక్క, ఈ పక్కవాడిని ఆ పక్క తీసుకు వెళ్తూ ఉంటాయి కానీ ఏ ఊరులోని బల్లకట్టు ఆ ఊరులోనే ఉంటుంది. మీకు అర్థం అవుతోందా? మనం అందరం బల్లకట్టు లాంటి వాళ్ళం అంటున్నారు ఆచార్యస్వాముల వారు. కొంతమంది సాధకులు ఏమి చేస్తారు అంటే పైకి ఏమీ తెలియనట్టు కనిపిస్తూ ఉంటారు, లోపల ఆధ్యాత్మికంగా ఎదిగిపోతూ ఉంటారు, పొందవలసింది ఏదో పొందుతారు. ఇంక మన పని సున్నా, ఏమి మిగులుతుంది అంటే అల్లరి మిగులుతుంది అంటున్నారు ఆచార్యస్వాములవారు. లోకంలో మనకి ఏదైనా గౌరవం ఉంది అనుకోండి స్మశానం దాకా పదిమంది వస్తారు. ఫలానా వాడు పోయాడు అని స్మశానం దాకా వస్తారు కానీ తరువాత రారు కదా, ఆ ఊరేగింపు స్మశానం తోటి ఆఖరు, దేహగతమైన చరిత్ర అక్కడే ముగిసిపోతుంది. ఈ ఊరేగింపులు, సరదాలు, యజ్ఞాలు, యాగాలు దేహం ఎంత నిజమో అవి కూడా అంతే నిజం, అసలు నువ్వు పొందవలసిన వస్తువు ఏదో లోపల పొందు. నిజమైన సాధకుడు బయటకి చడి చప్పుడు లేకుండా లోపల సైలెంట్‌గా పని చేసుకొని వాడు పొందవలసినది ఏదో పొంది వాడు మోక్షానికి వెళ్ళిపోతాడు. ఈ అల్లరి జనంతోటి వస్తుంది ఈ ప్రమాదం అంతా అంటున్నారు ఆచార్యస్వాములవారు. శరీరం పెద్దది అవ్వడానికి మనం ఏమి ప్రయత్నం చెయ్యక్కర్లేదు రెండు పూటలా అన్నం తింటూ ఉంటే శరీరం పెద్దది అవుతుంది. దాని గురించి సాధన చెయ్యక్కర్లేదు, నీకు వివేకం పెరగడానికి సాధన చెయ్యి. మోక్షం పొందడానికి సాధన చెయ్యి, నువ్వు శాంతి స్థితిలో నిలబడడానికి, అక్కడ establish అవ్వడానికి సాధన చెయ్యి. తెలివిగల వాళ్ళు ఏమి చేస్తారు అంటే చడి చప్పుడు లేకుండా పక్కవాడికి తెలియకుండా వాడి పని ఏదో వాడు చేసుకొంటూ వెళ్ళిపోతూ ఉంటాడు. ఈ అల్లరి జనం తోటే ప్రమాదం వస్తుంది అంటున్నారు.



# శ్రీమద్భగవద్గీత

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)**

**అమానిత్వమదంభిత్వమ్ అహింసా క్షాంతిరార్జవమ్ ।**
**ఆచార్యోపాసనం శౌచం స్థైర్యమాత్మవినిగ్రహః ॥ 13-07 ॥**

**తాత్పర్యము :** తానే శ్రేష్టుడనను భావము లేకుండుట, డాంబికము లేకుండుట, అహింస, క్షమించు గుణము, మనోవాక్కుల యందు సరళత్వము, శ్రద్ధాభక్తులతో గురుజనులను సేవించుట, బాహ్యాభ్యంతర శుద్ధి, అంతఃకరణ స్థిరత్వము, మనశ్శరీరేంద్రియముల నిగ్రహము.

అమానిత్వం, అదంభిత్వం, అహింస, క్షాంతి, ఆర్జవం, ఆచార్యోపాసనం, శౌచం, స్థైర్యం, ఆత్మ వినిగ్రహం, ఇవి జ్ఞానలక్షణాలు.

**అమానిత్వం -** అంటే ఆడంబరం ఉండకూడదు. కొంతమంది అస్తమానూ వాళ్ళని వాళ్ళు పొగుడుకుంటారు, ఇతరుల చేత పొగిడించుకుంటారు. అల్పత్వం ఉన్నవాడు, స్వల్పత్వం ఉన్నవాడు ఆడంబరంగా మాట్లాడతాడు. ఎవడైతే ఆడంబరం మాటలు చెబుతున్నాడో, ఎవడైతే వాడిని వాడే పొగుడుకోవడం పనిగా పెట్టుకున్నాడో, వాడు జపాలు చేసినా, పూజలు చేసినా అవి సత్య పూజలు కాదు, సత్య జపాలు కాదు. అందుచేత వాళ్లకి జ్ఞానం వచ్చే సమస్య లేదు అని భగవంతుడు చెబుతున్నాడు

**అదంభిత్వం -** డాంబికం లేకపోవటం. డంభం ఉన్నవాళ్ళు మంచి పనులు చేస్తారు. కానీ ఈ మంచి పనులు లోకం అంతాగుర్తించాలి అనుకుంటారు. వాళ్ళు చేసిన మంచి పనులు అస్తమాను వాళ్ళే గొప్పగా చెప్పుకుంటారు. వాళ్ళకి పుణ్యం వస్తే రావచ్చును

కానీ జ్ఞానం రాదు.

**అహింస –** హింసాప్రవృత్తి ఉండకూడదు. ఎదుటి మనుషులని వెటకారం మాటలతో బాధపెట్టటం, మాటలతో ఇతరులని గాయపరచటం హింసతో సమానం. కొంతమంది పైకి ఊరికే నటిస్తారు కానీ హృదయ పూర్వకంగా ఇతరుల క్షేమాన్ని కోరరు. అది కూడా హింసతోటి సమానం. మానసికంగా కానీ, వాక్కు ద్వారా కానీ మనం ఎవరినైనా హింస పెడితే, మళ్ళీ ఏదో ఒక జన్మలో మనం వారి చేత హింసింపబడతాము. అదే రమణమహర్షి గారు చెబుతారు, ఎదుటి వాళ్ళకి నువ్వు ఏది ఇస్తే అదే నీకు తిరిగి వస్తుంది" అని. అహింసా సిద్ధాంతాన్ని కనుక అవలంభించకపోతే సత్యం తెలియబడదు. ఇతరులు మనని హింస పెట్టడానికి ప్రయత్నించినా డిస్టర్బ్ అవ్వకూడదు. అల్పమైన గొడవలు మనసులో పెట్టుకుంటే, అశాంతి వస్తుంది, మనం వెళ్ళవలసిన గమ్యం చెడిపోతుంది. మనం కాశీ ప్రయాణమై వెళ్తుంటే, దారిలో ఎవడో తింగరి మాటలు మాట్లాడాడని పేచీలు పెట్టుకుని కూర్చుంటే, అక్కడే ఆగిపోతుంది ప్రయాణం. మన శరీరం యొక్క ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకుంటామో, మనకి పడని పదార్థాన్ని ఎలా తినమో, అలాగే మనస్సు యొక్క శాంతిని కూడా కాపాడుకోవాలి,

**క్షాంతి** అంటే ఓర్పు, సహనం. జీవితంలో ఏదైనా పని సాధించాలి అంటే ఓర్పు పట్టుదల రెండూ ఉండాలి. సహనాన్ని పిరికితనం అనుకోకూడదు. సహనం ఉన్న వాడికి దీర్ఘకాలం పోరాటం చేసే పటిమ వస్తుంది. మీరు ఓర్పు సహనం విడిచి పెట్టకుండా ఉంటే రాత్రి తరువాత ఉదయం ఎలా వస్తుందో, మీకు ఏదైనా కష్టం వచ్చినా, అది ఎప్పుడూ అలా ఉండిపోదు, మళ్ళీ మీకు వెలుతురు వస్తుంది, మీకు శాంతి కలుగుతుంది అని కృష్ణుడు చెబుతున్నాడు.

కలియుగంలో నూటికి తొంభై కలహాలకి మాటలే కారణం అని శారదామాత చెప్పేది. మన అనుభవంలో చూసుకుంటే, కుటుంబాలకి మధ్య పేచీలకి, మనిషికి మనిషికి మధ్య పేచీలకి వాక్కు తపస్సు లేకపోవడమే కారణం. శారీరక తపస్సు, వాక్కు తపస్సు, మానసిక తపస్సు, విడిచి పెట్టవద్దు అని భగవంతుడు పదే పదే చెప్పాడు. భగవంతుడు కోసం తపించినవాడే భగవంతుడిలో ఐక్యం అవుతాడు. క్షాంతి వల్ల మనస్సుకి వికాసం వస్తుంది, విశాలం అవుతుంది. ఓర్పు లేనివాడికి శాంతి కూడా ఉండదు.

**ఆర్జవం** అంటే వంకరలు లేకుండా, నిదానంగా ఉండడం. కొంతమంది మనసులో ఒకటి ఆలోచిస్తూ ఉంటారు, నోటితోటి ఇంకొకటి చెబుతారు, చేతితోటి ఇంకొక పని చేస్తారు. మనస్సుకి, మాటకి, చేతకి సంబంధం లేనివాళ్ళని వంకర మనుషులు అంటారు. సాధన లేకుండా ఆ వంకరలు ఊరికే పోవు. మసిపట్టిన గిన్నెని లోపల, బయట, అన్నిపక్కల చూసి ఎలా తోముతామో, అలా మనస్సులో ఏదో ఒక భాగాన్ని తీసుకుని వదిలేయకుండా, మొత్తం మైండులో అన్ని కోణాలు చూసి, ఏ కోణంలో వంకర ఉంటే, అది తీసేయమని కృష్ణుడు చెపుతున్నాడు. శరీరంలో ఏ భాగంలో ఉన్నా రోగం రోగమే. శరీరం అంతా బాగుంది కదా అని చెవిలో పోటు వస్తే వదిలేయము. అలాగే, ప్లస్ పాయింట్స్ ఎన్ని ఉన్నప్పటికీ ఎక్కడో ఒక్క మైనస్ పాయింట్ ఉన్నా అది మనస్సులో వంకరకి కారణం అవుతుంది కాబట్టి మొత్తం మైండుని తీసుకుని, ఏ లోపం అక్కడ కనిపిస్తుందో, ఏ బలహీనత కనిపిస్తుందో, చూసుకోమని కృష్ణుడు చెబుతున్నాడు. శరీరంలో వంకరలు అన్నీ స్మశానంలో కాలిపోతాయి. నీ మనస్సులో వంకరలు వచ్చే జన్మకి వచ్చేస్తాయి. అప్పుడైనా కష్టపడి నువ్వు వంకరలు తీసుకోవాలి. అందుచేత ఇప్పుడే వంకరలు తీసుకుంటే ఈ జన్మలోనే నీకు మోక్షం వచ్చేస్తుంది.


**ఆచార్యోపాసనం** అంటే ఆచార్యుడికి ఇవ్వవలసిన గౌరవం ఇవ్వాలి. గురువుని ప్రేమించాలి. ఆచార్యుడు తాను ఏ సుఖాన్ని అయితే అనుభవిస్తున్నాడో, ఆ శాంతిని, సుఖాన్ని తనని ఆశ్రయించిన వారికి ఇవ్వాలి అనుకుంటాడు. వాడికి మినహాయింపులు ఏమీ ఉండవు. నీకు విద్యని చెప్పడమే కాకుండా, ఆ వస్తువు నీకు అనుభవంలోకి తీసుకురావడం కోసం సర్వకాల సర్వావస్థలయందు ప్రయత్నం చేస్తాడు. ఆచార్యుడిని ఉపాసిస్తే, గురువుకి ఇవ్వవలసిన గౌరవం ఇస్తే, ఆయన హృదయాన్ని మనకి ఓపెన్ చేస్తాడు. గురువుని గౌరవించి నువ్వు తెలుసుకోవాల్సిన విషయం తెలుసుకోవాలి. మీరు ఎన్నో జన్మలు కష్టపడి స్వయంగా సంపాదించి తెలుసుకోలేనిది ఆచార్యులు చెప్పడం వల్ల మీకు తొందరగా అర్థం అవుతుంది. అందుచేత ఆచార్యుడిని కూడా దైవంతో సమానంగా చూడాలి.

**శౌచం** అంటే శుచిగా ఉండాలి. బయట శుభ్రత ఎంత ముఖ్యమో, లోపల అంటే మీ బుద్ధిలో శుభ్రత కూడా అంతే ముఖ్యం. బుద్ధిలో మాలిన్యం తొలగించుకోవాలి. మనలో ఏమైనా మల దోషం ఉంటేనే మనకి కోరిక కలుగుతుంది. ఆశ పుడుతుంది. బయట గోడ

పక్కన మలం ఉంటే ఎంత ఆపుచేసినా ఆవాసన వస్తుంది. అలాగే ఏ రకమైన కోరిక వచ్చినా లోపల మలం ఉందని అర్థం. కామం అనేది బయట ఎక్కడో లేదు, మన ఇంద్రియాలలో, మనసులో, బుద్ధిలో, దాక్కుని ఉంది అని చెప్పాడు కృష్ణుడు. నువ్వు విచారణ చేసి, సాధన చేసి దానిని తొలగించుకోవల్సిందే కానీ అది సర్జరీ చేసేది కాదు. బాహ్యంగా శరీరం మీద ఉన్న దుమ్ము, ధూళి స్నానం చేసి తొలగించుకుంటాము. అలాగే నీ మనసులో, బుద్ధిలో ఉన్నటువంటి కామము క్రోధము నిన్ను అశుచి చేస్తున్నాయి. వాటిని తొలగించుకోవడానికి నువ్వు చేసే ప్రయత్నమే మనసుకి చేయించే స్నానం. నీ అంతఃకరణంలో దోషాలు పోగొట్టుకోవడం కోసం ప్రార్థన, జపం, ధ్యానం అవసరం. నిరంతరం భగవంతుడిని స్మరించడం వల్ల శౌచం వస్తుంది.

**స్థైర్యం** అంటే స్థిరత్వం. కొంతమంది రోజుకో రకంగా మాట్లాడతారు. స్థిరత్వం లేకపోతే జ్ఞానం కలగదు, నువ్వు పెట్టుకున్న గమ్యం చేరుకోలేవు. భౌతికంగా అయినా సరే ఏదైనా ఒక పని సాధించాలంటే స్థిరత్వం ఉండాలి. స్థిరత్వం ఉన్నవాడు ఎన్నిసార్లు ఫెయిల్ అయినప్పటికీ కంగారుపడడు, తన పనినే దృష్టిలో పెట్టుకుంటాడు. ప్రతీ చిన్న విషయానికి కంగారుపడితే, , వాడికి స్థిరత్వం లేదని అర్థం. ఎప్పుడైతే నీకు స్థిరత్వం వచ్చిందో అప్పుడు నీ ఇంద్రియాలకి, మనస్సుకి కుదురు వస్తుంది. స్థిరత్వం లేకపోతే జ్ఞానాన్ని సంపాదించలేవు.

**ఆత్మ వినిగ్రహః** అంటే మనో నిగ్రహానికి ప్రయత్నం చెయ్యాలి. మనస్సు యొక్క నిగ్రహం అంతా కూడా ఆహార నియమం మీద ఆధారపడి ఉందని భగవాన్ చెప్పారు. ఆయన మితాహారం అన్నారు, కృష్ణుడు యుక్తాహారం అన్నాడు. అంటే ఆ శరీరాన్ని బట్టి, వాడికున్న వయస్సుని బట్టి, ఆరోగ్యాన్ని బట్టి అతిగా కాకుండా యుక్తంగా తినాలి. మనం తినే ఆహారం యొక్క ప్రభావం మనస్సు మీద ఎక్కువ ఉంటుంది. ఎన్ని గ్రంథాలు, శాస్త్రాలు చదివినా, వీటన్నిటిలో మనస్సుని నిగ్రహించుకోమనే ఉంది. నువ్వు మనస్సుని నిగ్రహించుకోవడం మానేసి శాస్త్రాలు చదవడమే పనిగా పెట్టుకుంటే, ఆ శాస్త్రాల్లో ఉన్న శబ్దం యొక్క అర్థం మాత్రమే తెలుస్తుంది, నీకు పాండిత్యం వస్తుంది, దండలు వేస్తారు, పొట్ట వెళ్ళిపోతుంది, అంతవరకే! నువ్వు మనస్సు నిగ్రహించుకోవడానికి కొంచెం కూడా ప్రయత్నం చెయ్యకుండా, ఆ శాస్త్రంలో ఉన్న శబ్దాన్ని పట్టుకుని అలా ఊరేగుతూ ఉంటే నీకు మనస్సు నిగ్రహం రాదు, నీకు ఆత్మజ్ఞానం కలగదు.



సద్గురు శ్రీ నాన్నగారి విగ్రహ ప్రతిష్ఠా వార్షికోత్సవం సందర్భంగా
ప్రత్యేక అలంకరణ - శ్రీరమణ క్షేత్రం, జిన్నూరు

# ఆరాధన

భగవాన్ శ్రీరమణమహర్షి తారీఖు ప్రకారం ది॥ 14-04-1950న రాత్రి గం॥ 8-47 ని॥లకు అరుణాచల క్షేత్రములో తన పార్థివ శరీరాన్ని విడిచిపెట్టారు. అది మృత్యుంజయుడు శరీరాన్ని విడిచిపెట్టినరోజు, భవసాగరాన్ని శాశ్వతంగా దాటినరోజు. సెప్టెంబరు 1, 1896న అరుణాచల క్షేత్రంలో అడుగుపెట్టినది మొదలు ఏబది నాలుగు సంవత్సరములు ఆ క్షేత్రాన్ని విడిచిపెట్టలేదు, తాను శాంతిగా, పరిపూర్ణంగా నిష్క్రమించారు. అనేక శరీరాలు ఈ భూమి మీద పుట్టడం, కొంతకాలము తరువాత మరణించడం మనము చూస్తూనే ఉన్నాము. అటువంటి వాటికి ఏ ప్రత్యేకత ఉండదు కానీ, జ్ఞాని శరీరాన్ని విడిచి పెట్టడానికి ఒక ప్రత్యేకత ఉంది. ఆ ప్రత్యేకత ఏమంటే అప్పటికే వాస్తవంగా తానెవరో అనుభవైకవేద్యం చేసుకొని; ఎరుకలో, అద్వైతానుభవంలో శరీరాన్ని చాలించడం. మానవులకు అతి పెద్ద భయం మరణభయం. మన అస్తిత్వాన్ని దేహానికే పరిమితం చేస్తున్నాము కాబట్టి మరణముతో దానిని పోగొట్టుకుంటాము అన్న భయము మరియు శరీరము మరణిస్తే నేను ఉండను అన్న భయము వల్ల ఎన్ని సాధనలు చేసినా అమృతులమైన మనము మృత్యుభయాన్ని అతిక్రమించలేకపోతున్నాము. జనన-మరణాలు అజ్ఞాన జనిత భ్రాంతి రూపములు, అవి వ్యవహారిక సత్యము మాత్రమే, జనన-మరణాలు వర్తించేది నాదికి మాత్రమే, నేనుకు కాదు. ఏదీ అది కాదు, ఎవరూ వారుకాదు మూలములోకి వెళితే ఆత్మే సకలమూ. భగవాన్ శరీరము విడిచిపెట్టడంతో దేహగతమైన, వ్యవహారికమైన యాత్ర సమాప్తమైనదే కానీ, నిజమైన ఆయన ఉనికికి మరణము లేదు. భగవాన్ శ్రీరమణుడు వచ్చారు, కొంతకాలం ఉన్నారు, తిరిగి ఎక్కడికో వెళ్ళిపోయారు అనుకుంటే పొరపాటే; మనకు ఆయన బోధ అర్థము కాలేదనే చెప్పాలి. మనలోని పంచకోశాలను నిరసిస్తే ఉన్నదే పరమాత్మ. ప్రకృతిలోని నామ-రూపాలను నిరసిస్తే ఉన్నదే పరమాత్మ. స్వధర్మాన్ని ఆచరిస్తూ, దాని ఫలితాన్ని పరమాత్మకు అర్పించడమే నిజమైన ఆరాధన. నమ్మినవారందరికీ సద్గురువే - తల్లి, తండ్రి, గురువు, దైవమూ, సమస్తమూ. అజ్ఞానం వల్ల శరీరము వచ్చింది, జ్ఞానంతో శరీరాన్ని విడిచిపెట్టాలి. దేహము జీవించియుండగానే దేహాత్మబుద్ధి నుండి విడుదల పొందాలి, అన్నదే వారి ఉపదేశ సారము. భగవాన్ శ్రీరమణుని యొక్క భౌతిక శరీరము మరణించింది కానీ, తన్ను తాను తెలుసుకున్న ప్రతి ఒక్కరిలోనూ జ్ఞానజ్యోతిగా నిరంతరం ప్రకాశిస్తూనే ఉన్నారు.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**